అభివృద్ధి పనులు అంతంతే..!


ఖాద్రియా మసీదు సమీపంలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త. రోడ్డుపైనే పారుతున్న మురుగు

- 3 గుట్టల మధ్య ఇళ్ల నిర్మాణం
- నగం వరకు మట్టిరోడ్లే శరణ్యం
- కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం
- 31వ వార్డులో జనాభా 6,243

ప్రధాన వీధులు: వీరన్నపేట (కొంత భాగం), హీరాబాయితండా, ఎర్రమన్నుగుట్ట (కొంత భాగం), మక్కామసీదు ప్రాంతం (కొంత భాగం), పటేల్‌నగర్, షరీఫ్‌కాలనీ.

వార్డ్ వాచ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 31వ వార్డులో ఎన్నో సమస్యలు తిష్ట వేశాయి. ఎర్రమన్నుగుట్ట, వీర మైసమ్మగుట్ట, టీడీగుట్ట మధ్య వెలసిన ఈ వార్డు పరిధిలో అభివృద్ధి పనులు అంతంత మాత్రమే చేపట్టారు. కొన్నేళ్లుగా పటేల్‌నగర్, షరీఫ్‌కాలనీలలో జోరుగా ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో మున్సిపల్ అధికారులు, పాలకులు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణం నుంచి ఈ వార్డుకు వెళ్లాలంటే మక్కా మసీదు రోడ్డే దిక్కు. ఇది కూడా సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా పెద్ద వాహనాలు వస్తే ఆగిపోవాల్సిందే. శివారులోనే డంపింగ్‌యార్డు ఉండటంతో అక్కడి చెత్తను అంటిపెట్టినప్పుడు మంటలతో పాటు దట్టమైన పొగలు వ్యాపిస్తాయి. దీనిని నివారించేందుకు గాను సమీపంలో ఏడాది క్రితం పవర్ బోరు వేయించారు. ఆ మంటలను ఆర్పి వేయడానికి పెద్ద పైపుతో నీటిని వినియోగిస్తుంటారు. ఇక హీరాబాయితండా (బంజారా కాలనీ)లో సుమారు 30 ఇళ్లు ఉన్నాయి. కాగా, భూత్పూర్–చించోళి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇవన్నీ ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మొత్తం కాలనీతో పాటు ఎర్రమన్నుగుట్టలో నిర్మించిన మరో 40 ఇళ్లను తొలగించనున్నట్టు ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఆరు నెలల క్రితం మార్కింగ్ వేశారు. దీంతో నిరాశ్రయులవుతామని అక్కడి వారు లబోదిబోమంటున్నారు. తమకు తగిన పరిహారంతో పాటు వేరే చోట ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. ఖాద్రియా మసీదు సమీపంలో సుమారు 40 ఇళ్లు ఉంటాయి. ఇక్కడికి పారిశుద్ధ్య కార్మికులు రారని ఈ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు.


అపరిశుభ్రంగా ఉన్న మినీ ట్యాంకు పరిసరాలు


షరీఫ్‌కాలనీలో మట్టిరోడ్లే గతి..


పటేల్‌నగర్‌లో ఇదీ పరిస్థితి

మార్కింగ్ వేసి, హద్దురాళ్లు పాతారు



ఆరు నెలల క్రితం విస్తరణలో భాగంగా భూత్పూర్–చించోళి జాతీయ రహదారి కోసం మా తండాతో పాటు పక్కనున్న ఎర్రమన్నుగుట్టలో నివసిస్తున్న సుమారు వంద మందికి ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు సూచించి వెళ్లారు. దీనికోసం మార్కింగ్ వేయడమే గాక హద్దురాళ్లు పాతిపోయారు. మేమంతా కూలి, మేస్త్రీ పనులు చేసి జీవనం సాగిస్తున్నాం. కట్టుబట్టలతో ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదు. తగిన పరిహారంతో పాటు వేరే చోట ఇళ్లు కట్టించి ఇవ్వాలి.

– మన్యానాయక్, హీరాబాయితండా (బంజారాకాలనీ)

కుక్కల బెడద ఎక్కువ



మా గల్లీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్నపిల్లలను బయటకు పంపాలంటేనే భయమేస్తుంది. వాటిని పట్టుకుని దూర ప్రాంతంలో వదిలివేయాలి. ముఖ్యంగా రోడ్లు ఊడ్చడానికి, డ్రెయినేజీలు శుభ్రం చేయడానికి పారిశుద్ధ్య కార్మికులు సరిగా రారు. కొన్ని చోట్ల వీధి లైట్లు పనిచేయడం లేదు. మినీ వాటర్ ట్యాంకు వద్ద అపరిశుభ్రంగా తయారైంది. ఈ సమస్యలను మున్సిపల్ అధికారులకు, కౌన్సిలర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– శ్రీను, ఎర్రమన్నుగుట్ట ప్రాంతం, వీరన్నపేట

వివిధ పనులు చేశాం



నాలుగేళ్లలో సుమారు రూ.58 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయించాం. మరో రూ.15 లక్షలతో మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. అలాగే రూ.15 లక్షలతో ఐదు హైమాస్ట్ లైట్లు, మరో ఐదు పవర్ బోర్లు ఏర్పాటు చేశాం. మిషన్ భగీరథ పథకం పైపులైన్లు ఎప్పుడైనా పగిలిపోతే ఈ పవర్ బోర్ల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నాం. పటేల్‌నగర్‌లో 22 విద్యుత్ స్తంభాలతో పాటు ఎల్‌టీ లైన్ తీగలు వేయించాం.

– షబానాబేగం, కౌన్సిలర్, 31వ వార్డు

కంకర పరిచారు.. బీటీ మరిచారు


కంకర వేసి వదిలేసిన పోల్కంపల్లి రోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి రోడ్డుపై దుమ్ము రేగుతోంది. వాహనం వెళ్లిందంటే చాలు దాని వెనకాల వచ్చేవారు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి పోల్కంపల్లి వరకు బీటీ రెన్యువల్ కోసం నిధులు మంజూరు కాగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కంకర పరిచి వదిలేశారు. రహదారి నుంచి 1.4 కిలోమీటర్ల దూరం బీటీ రెన్యువల్ కోసం గత ప్రభుత్వంలో ఎంఆర్ఆర్ కింద రూ.90లక్షలు మంజూరు అయ్యాయి. గతేడాది మే నెలలో పనులు మొదలు పెట్టారు. రహదారి నుంచి గ్రామం వరకు కంకర వేసి వదిలేయడంతో నిత్యం రోడ్డుపై దుమ్ము వస్తుంది. దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలతో పాటు టిప్పర్లు తిరుగుతుంటాయి. వాహనాలు వెళ్లినప్పుడు వచ్చే దుమ్ముతో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై దుమ్ము రాకుండా ట్యాంకర్‌తో నీళ్లను పోయిస్తున్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ లక్ష్మణ్‌గౌడ్ సంప్రదించగా పోల్కంపల్లి బీటీరోడ్డుతో పాటు ఇదే రోడ్డుపై బ్రిడ్జి, తాళ్లగడ్డకు వెళ్లే దారిలో చెరువు కట్ట బ్రిడ్జి నిర్మాణాలను కలిపి మూడు పనులను ఒకే టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లు రాలేదని, బిల్లు రాగానే మిగిలిన పనులు చేపడతామని కాంట్రాక్టర్ చెప్పినట్లు ఏఈ పేర్కొన్నారు.

ప్రతి దేవాలయంలో శ్రమదానం


భూత్పూర్‌లోని రామలింగేశ్వర దేవాలయం శుభ్రం చేస్తున్న శాంతికుమార్

భూత్పూర్: అయోధ్యలోని రామమందిరం ప్రతిష్ఠాపనకు సమాయత్తం కావాలని, ప్రతి దేవాలయం, మందిరాల్లో శ్రమదానం చేయాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటీలోని రామలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం శ్రమదానంలో భాగంగా దేవాలయాన్ని శుభ్రపరిచారు. ఈ నెల 22న ఎల్ఈడీల ద్వారా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని వీక్షించాలని, అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను తలపై చల్లుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సత్యయ్యగౌడ్, రవీందర్, రాంరెడ్డి, సత్యానారాయణ, ఆంజనేయులు, ఫారుఖ్, మల్లేష్, శ్రీను, సదానంద్, రాము తదితరులు ఉన్నారు.

కేంద్రపథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హన్వాడ: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపి రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ కోరారు. బుధవారం మండలంలోని తిరుమలగిరిలో బుధవారం 'వికసిత్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొండా బుచ్చిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కావలి శ్రీనివాసులు, కొండాలింగం, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో 5 రామజ్యోతులు వెలిగించాలి

జడ్చర్ల టౌన్: 22న అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠాపన పురస్కరించుకుని ప్రతి ఇంట్లో ఐదు రామజ్యోతులు వెలిగించాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోని ఏదైనా ఓ ఆలయంలో వర్చువల్‌గా చూసేందుకు స్క్రీన్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అప్పటి వరకు గ్రామాల్లోని అన్ని ఆలయాలు శుద్ధి చేసుకోవాలని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో కృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, నాగరాజు నాయకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు


బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నవాబుపేట: మండల కేంద్రంలో సంక్రాంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల విజేతలకు నిర్వాహకులు బుధవారం బహుమతులు అందజేశారు. జేకే ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో వారి ఇళ్ల ఎదుట వేసిన ముగ్గులను పరిశీలించిన బృందం విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి ప్రతిభ భారతికి 47 గ్రాముల వెండి, రెండు నుండి 4 బహుమతుల వరకు 20 గ్రాముల వెండి, మరో 40 మందికి తులం వెండి చొప్పున, మరో 40 మందికి చీరలతో పాటు మరో 200 మందికి నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సుధాకర్‌చారి, గీతారాణి, లక్ష్మినర్సింహచారి, అంజయ్య, వెంకటయ్య, జానికిరాములు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు


మరికల్‌లో వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

మరికల్: కృష్ణా బ్రిడ్జి మరమ్మతులతో మరికల్ విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద రాయిచూర్ వెళ్లే వాహనాలను గద్వాల్ మీదుగా మళ్లించేందుకు బుధవారం పోలీసులు చర్యలు చేపట్టారు. టై రోడ్డు వరకే వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. రాయిచూర్ వెళ్లే వాహనాలు మాత్రం గద్వాల్‌మీదుగా పంపిస్తున్నారు. ఇందుకు సబ్‌స్టేషన్ చౌరస్తావద్ద రాయిచూర్ వెళ్లే వాహనలకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

వేరుశనగ క్వింటా రూ.7,171

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వేరుశనగ క్వింటా గరిష్టం రూ.7,171, కనిష్టం రూ.4,200 ధరలు పలికాయి. అలాగే, శనగలు గరిష్టం రూ.5,690, కనిష్టం రూ.5,650, వడ్లు హంస గరిష్ట, కనిష్టంగా రూ.1,950, వడ్లు సోనా గరిష్టం రూ.2,869, కనిష్టం రూ.2,569, ఎర్ర కందులు క్వింటాకు గరిష్టం రూ.9,792, కనిష్టం రూ.7,308, తెల్ల కందులు గరిష్టం రూ.10,050, కనిష్టం రూ.8,169 ధరలు పలికాయి.

రోహిత్ వేములకు ఘన నివాళి


రోహిత్ వేములకు నివాళి అర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: రోహిత్ వేముల 8వ వర్ధంతిని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టీఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జాతీయ విద్యా విధానం (2020) అనే అంశంపై చర్చించారు. ఈ సభకు ముఖ్య వక్తలుగా టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి, టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ మన్యంకొండ, వన్నాడ అంజన్న, టీఎస్‌డీఎస్‌పి రాష్ట్ర కోకన్వీనర్ తలారి నరేష్, మల్లేష్, చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి రామచంద్రయ్య, కృష్ణ, కేవీఎస్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవింద్, మోహనకృష్ణ, ఎస్.లక్ష్మయ్య తదితర సంఘాల నాయకులు పాల్గొని రోహిత్ వేములకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2016 జనవరి 17న రోహిత్ వేములను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వ్యవస్థీకృత హత్యకు గురిచేశారని తెలిపారు. యూనివర్సిటీ అంతర్గత విషయాల్లో ఏబీవీపీ, బీజేపీ నాయకులు జోక్యం చేసుకోవడంతోనే దళిత విద్యార్థులను సాంఘిక బహిష్కరణ చేయడంతో పాటు రోహిత్ వేముల మరణానికి కారణమయ్యారని విమర్శించారు. భవిష్యత్‌పై ఎంతో ఆశతో దళిత విద్యార్థులు యూనివర్సిటీలో ఉన్నత చదువులకై వస్తే యూనివర్సిటీలో కూడా వెలివేయడం శోచనీయమని అన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ జనార్దన్

కోస్గి: 18 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే బాలకార్మిక చట్టాల కింద యజమానులపై కేసులు నమోదుచేస్తామని సీఐ జనార్దన్ గౌడ్ సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని ఇటుక బట్టీల యజమానులకు, కార్మికులకు అవగాహన నిర్వహించారు. చదువుకునే వయస్సులో పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని బట్టీల యజమానులు గుర్తించుకోవాలన్నారు. ఇటుక బట్టీలలో పనిచేసేందుకు వచ్చిన కార్మికులకు చదువుకునే వయస్సు ఉంటే సమీప పాఠశాలలో చేర్పించాలన్నారు. బట్టీల వద్ద మాదక ద్రవ్యాలు దొరికిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు, ఇటుక బట్టీల యజమానులు పాల్గొన్నారు.

పోమాల్ సర్పంచ్‌కు నాయకుల చేయూత

నవాబుపేట: మండలంలోని పోమాల్ సర్పంచ్ కృష్ణ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం నాయకులు రూ.55 వేలు అందించారు. కృష్ణకు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. అతడికి అప్పట్లో ఆపరేషన్ చేసి వెనుక భాగంలో స్టీల్ రాడ్ వేశారు. ఇటీవల కృష్ణకు మూర్ఛ వచ్చి కిందపడటంతో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో బుధవారం ఆస్పత్రిలో చేర్పించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు కృష్ణగౌడ్, అలీ, తీగలపల్లి సర్పంచ్ చెన్నయ్య, సిద్దొటం సర్పంచ్ వెంకటేష్ ఆర్థికంగా చేయూతనిచ్చారు.

బాధితులకు పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వడ్ల మాధవులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. అదే విధంగా అడ్డాకుల మండలం ముత్యాలంపల్లికి చెందిన మురళీస్వామి తండ్రి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించారు.

వేతనాలు చెల్లించాలి

మాగనూర్: మధ్యాహ్న భోజన కార్మికుల వేతనలు విడుదల చేయాలని కోరుతూ.. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. 9నెలలుగా కార్మికులకు వేతనాలు అందడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

క్లుప్తంగా

పంచాయతీ భవనాలు పూర్తి చేయండి



కోయిల్‌కొండ: మండలంలో చేపడుతున్న పంచాయతీ భవన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాములు ఆదేశించారు. బుధవారం మండలంలోని కానాయపల్లిలో పంచాయతీ భవన పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించారు. మొక్కలను ఇచ్చిన గడువులోగా సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని సూచించారు.

సామూహిక గాయత్రి మహా మంత్రజపం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సకల మానవాళి శ్రేయస్సు కోసం స్థానిక కాటన్‌మిల్లు ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం సామూహిక గాయత్రి మహామంత్ర జప యజ్ఞం చేశారు. పాలమూరు బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కల్వకోలను చిత్తరంజన్ దాస్ స్మారకసేవా సమితి ప్రతినిధులు కందిబండ ప్రసాదరావు, పరాయతనం శరత్ కృష్ణ, ఓలేటిమరిడి రాజు, మహేశ్వరావు, ఫణిప్రసాద్, వెంకటసాయి, కందిబండ పద్మ, ఓలేటి పద్మ, ఐక్యవేదిక సభ్యులు గొంద్యాల రాఘవేంద్రశర్మ, తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, వేముల మనోహర్‌రావు కొవ్వూరు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ రవినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు వ్యవసాయశాఖ అమలు చేసే పథకాలను రైతులకు చేరేలా కృషి చేయాలని అన్నారు. సంఘం చైర్మన్ యశ్వంత్‌రావు, అధ్యక్షుడు రాంపాల్, రాజేందర్‌రెడ్డి, ప్రత్యూష, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావు సేవలు మరువలేనివి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రిటైర్డ్ తహసీల్దార్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రావు సేవలు మరువలేనివని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు స్వామి అన్నారు. ప్రభాకర్‌రావు దశదిన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌గా ప్రజలకు సేవలు చేశారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పాటు పడతామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మురళీ, జిల్లా అధ్యక్షుడు అనంతరాములు, ప్రతాప్, శంకర్‌దాసు, వెంకటేశ్, బుచ్చన్న, శ్రీకాంత్, నీలికిశోర్, అంజి పాల్గొన్నారు.

ఒకే పీహెచ్‌సీతో ఇక్కట్లు

- 77వేలకు పైగా జనాభా
- వైద్య సేవల్లో నవాబుపేట పీహెచ్‌సీకి ప్రత్యేక గుర్తింపు

నవాబుపేట: మండల పీహెచ్‌సీలో ఏడాదిలో 291 ప్రసవాలు చేసి జిల్లాలోనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రికార్డు సృష్టించి మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఇక్కడి సిబ్బంది పనితీరు జిల్లా స్థాయిలో నిలిచింది. ఇక్కడి వరకు బాగానే ఉన్న మండలంలో ఒకే ఒక పీహెచ్‌సీ ఉండటంతో సిబ్బందితో పాటు ప్రజలకు సైతం తీవ్ర ఇబ్బందులు తప్పటంలేదు. 54 గ్రామాలకు 76,981 మంది జనాభా ఉన్నారు. దీంతో మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీకి చుట్టూ ఉన్న గ్రామాలు 12 కిలోమీటర్ల దూరం రావాల్సిందే. పైగా ఇక్కడ కుటుంబ నియంత్ర ఆపరేషన్లు చేయకపోవటంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి వెళ్లాల్సిందే. నిబంధనల ప్రకారం 25 వేల జనాభకు ఒక పీహెచ్‌సీ ఏర్పాటు చేయాల్సి ఉండగా, మండలంలో మరో మూడు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.


నవాబుపేట పీహెచ్‌సీ

సిబ్బంది కొరత

గ్రామాలలో ఉన్న సబ్ సెంటర్లకు సైతం సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మొత్తం 11 సబ్‌సెంటర్లలో ఆరుగురు సబ్‌సెంటర్ ఏఎన్ఎంలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా కొల్లూర్, రుద్రారం, ఇప్పటూర్, చౌదూర్, లింగంపల్లి, నవాబుపేట సబ్‌సెంటర్ల పరిధిలోని ఇన్‌చార్జ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు డాక్టర్లు ఉండాల్సిన పీహెచ్‌సీలో ఒక డాక్టర్ అది కూడా కాంట్రాక్ట్, అలాగే ఎంపీహెచ్ఓ, మెయిల్ సూపర్‌వైజర్, స్టాఫ్‌నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కారుకొండలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



మండలంలో మేజర్ గ్రామాల్లో ఒకటైన కారుకొండలో పీహెచ్‌సీ అవసరం. ఏళ్ల నుంచి ఇక్కడ సబ్ సెంటర్ కొనసాగుతుంది. కాగా జనాభా ప్రకారం ఇక్కడ అన్ని చాలా మారుమూల గ్రామాలకు మధ్యలో పెద్ద గ్రామం కావటంతో అన్ని రకాల సదుపాయాలు ఉంటాయి. ప్రతి విషయానికి మండల కేంద్రం లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది.

– గణేష్, కారుకొండ

జిల్లా అధికారులు దృష్టి సారించాలి



మండలంలో జనాభాను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీల ఏర్పాటుపై జిల్లా అధికారులు దృష్టి సారించాలి. అలాగే ఇక్కడ పీహెచ్‌సీలో కుటుంబ నియంత్ర ఆపరేషన్లకు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులకు వివరించాం. ఆస్పత్రిలో అన్ని సదుపాయలు ఉన్నాయి. సిబ్బంది కొరత ఉంది. ప్రతి నెల క్యాంపుల కోసం వైద్య సిబ్బంది, గర్భిణులు ఎదురు చూడాల్సి వస్తుంది.

– నరేష్ చంద్ర, మండల వైద్యాధికారి